
# నవ్వితే నవ్వండి!



- సేకరణ : వాసంతి మాఘుపు.

## తెలివైన దంతవైద్యుడు!

ఒక దంతవైద్యుడు చాలా కాలం తరువాత అతని స్నేహితుని (కంటివైద్యుని) కలవడం తటస్థించింది.

**కంటివైద్యుడు** : హల్లో నవీన్! ఎలా ఉన్నావ్? చాలా కాలము తర్వాత నిన్ను కలవడం ఆనందంగా ఉంది.

**దంతవైద్యుడు** : అవును సుభాష్, నిన్ను చూడడం నాకు కూడా ఆనందంగా ఉంది. ఇలా కలవడం ఆశ్చర్యం!

**కంటివైద్యుడు** : నేను కంటివైద్యునిగా క్లినిక్ నడుపుతున్నాను. నీ సంగతి ఏమిటి?

**దంతవైద్యుడు** : నేను పంటి వైద్యశాల నడుపుతున్నాను.

**కంటివైద్యుడు** : మంచిది. నీవు ఈ వృత్తిని ఎన్నుకోవడానికి కారణమేంటి?

**దంతవైద్యుడు** : దీనివల్ల ఆదాయం ఎక్కువని ఆ నిర్ణయం తీసుకున్నాను.

**కంటివైద్యుడు** : ఎలా?

**దంతవైద్యుడు** : మనము కళ్ళుగాని, చెవులుగాని, మరేదైనా భాగము గాని తీసుకుంటే, అవి 2 లేదా 3 మాత్రమే ఉంటాయి. కాని పళ్ళు అలా కాదు. సగటున 32 ఉంటాయి కదా!

**కంటివైద్యుడు** : ??? ☹ *(శ్రీ కె.జి. కృష్ణమోహన్ (రాయగడ, ఒరిస్సా) గారికి ధన్యవాదములతో)*

## ఎవరు గెలుస్తారు?

ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారు. వారి మధ్య సంభాషణ ఈ విధముగా కొనసాగింది.

**మొదటి బాలుడు** : మనలో ఎవరు గెలుస్తారో చెప్పగలవా? నువ్వా ... నేనా?

**రెండవ బాలుడు** : ... ... ... ... (మౌనం)

**మొదటి బాలుడు** : చెప్పలేవా?

**రెండవ బాలుడు** : నన్ను కొంచెం ఆలోచించుకోనీ.

**మొదటి బాలుడు** : ఇంకా ఆలోచిస్తున్నావా? చెప్పగలవా - లేదా?

**రెండవ బాలుడు** : నా వల్ల కాదు.

**మొదటి బాలుడు** : నేనే గెలిచాను. చూసావా?

**రెండవ బాలుడు** : ??? ☹

**నిఘంటువు!**

**మొదటివ్యక్తి** : నా నిఘంటువులో 'అసాధ్యము' అనే పదమే లేదు. (గర్వమును ప్రదర్శిస్తూ)

**రెండవవ్యక్తి** : ఇప్పుడు అనుకుని ఏమి ప్రయోజనం? కొనేముందే అన్ని పదములు ఉన్నాయో లేదో చూసుకుని ఉండవలసింది.

**మొదటివ్యక్తి** : ??? ☹

**అనుమతి!**

ఒక అధికారి అతని పై అధికారిని కలిసినపుడు -

**అధికారి** : గుడ్ మార్నింగ్ సర్!

**పై అధికారి** : వెరీ గుడ్ మార్నింగ్! ఏమిటి సంగతి?

**అధికారి** : నేను మా ఆవిడని డాక్టర్ దగ్గరకి తీసుకొని వెళ్ళడానికి అనుమతి కోరడానికి వచ్చాను.

**పై అధికారి** : అవునయ్యా! చెప్పడం మరచిపోయాను. ఇందాక మీ ఆవిడ ఫోన్ చేసి, తనకి బాగానే ఉందని, డాక్టర్ని కలవవలసిన పని లేదని చెప్పింది. వెళ్ళి నీ పని చూసుకో.

**అధికారి** : (అనుకోని ఈ సమాధానికి తికమకపడి) నాకు పెళ్ళే కాకపోతే ఎవరండి ఫోన్ చేసారు? (అని నాలుక కరుచుకుంటాడు)

**పై అధికారి** : అదీ సంగతి. నువ్వు అబద్ధం చెప్పావన్నమాట.

**అధికారి** : ☹

**మూడు!**

ఇద్దరు పొరిగింటి ఆడవాళ్ళ సంభాషణ:

**సుగుణ** : వదినగారూ! కాస్తంత కందిపప్పు ఇస్తారా? రేపు తిరిగి ఇచ్చేస్తాను.

**రమణి** : దానికేంగానీ వదినగారూ! పిల్లలకి క్యారేజ్ పంపలేదా?

**సుగుణ** : ఇదిగో దానికోసమే ఆత్రుత పడుతున్నాను. మీ అబ్బాయి 5 వతరగతి కదూ!

**రమణి** : అవును. మీ అబ్బాయి 3 వతరగతి కదా! చాలా చురుకైన వాడు.

**సుగుణ** : ఏం చురుకులెండి! మూడు ఉండాలిగాని బాగానే చదువుతాడు. లేకపోతేనే సతాయిస్తాడు.

**రమణి** : మావాడు కూడా మూడులో ఉన్నప్పుడు బాగానే చదివేవాడు. నాలుగుకి వచ్చిన దగ్గరనుండి ఏడిపిస్తున్నాడు.

**సుగుణ** :

*ఈసారికి ఇంతే! మళ్ళీ వచ్చే సంచికలో మరికొన్ని!!*